క్లుప్తంగా

అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో సంపూర్ణ సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ, టీబీ ఇతర అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, ల్యాబోరేటరీస్ రమేష్, రాకేష్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో ఇళ్ల స్థలాల పంపిణీకి నిర్ణయం

భీమారం: మండలంలోని ఆరెపల్లిలో ప్రభుత్వ భూమిని 200మంది నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వాసంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనెంబర్ 41లో గల 5ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇందులో ఇప్పటివరకు ఇళ్లు కాని స్థలం కాని లేని నిరుపేదలను గుర్తించి వారికి ఒక్కొక్కరికి 75గజాల భూమిని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన అర్హులైన నిరుపేదలు ఈ నెల 2, 3తేదీల్లో స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లు పెట్టాలని తహసీల్దార్ కోరారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ ప్రభు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

జైపూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గోదారి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలలకోసారి నిర్వహించే ఈ సమావేశాన్ని అరగంటలోనే ముగించి మమా అనిపించారు. ప్రజాసమస్యల పరిష్కారం, ప్రభుత్వ అభివృద్ధిపై చర్చ సాగేందుకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంపై సభ్యులు శ్రద్ధ చేయకపోవడంతో ప్రతిసారీ మొక్కుబడిగా సభ సాగుతోంది. వరుసగా కోరం లేక వాయిదా వేస్తూ వచ్చిన సర్వసభ్య సమావేశంలో, ఈ సారి సైతం అదే తీరున అరగంటలోనే సభ్యులు సమావేశాన్ని ముగించగా, సగం మందికిపైగా సభ్యులు సమావేశానికే హాజరుకాకపోవడం గమనార్హం. కార్యక్రమంలో డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణ, సహకార సంఘం చైర్మన్ తిరుపతి, పలుశాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

నోటీసు బోర్డుపై విద్యార్థుల జాబితా

మందమర్రిరూరల్: స్థానిక మోడల్‌స్కూల్‌లో 2023–24విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న 321మంది విద్యార్థుల నుంచి మెరిట్, స్థానికత రిజర్వేషన్ ఆధారంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాల బోర్డుపై అతికించినట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి తెలిపారు. ఫోన్ ద్వారా కూడా సమాచారమిచ్చినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, బోనోఫైడ్ జిరాక్స్‌లతో పాటు ఒరిజినల్ టీసీ, రెండు పాస్ ఫొటోలను ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీలోపు ఉదయం10గంటల నుంచి ఒంటి గంట వరకు పాఠశాలలో అందజేసి అడ్మిషన్ పొందాలని కోరారు.

లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న తోట శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: జిల్లా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ జన్మదిన వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆనంద నిలయంలో ఘనంగా నిర్వహించారు. ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం పండ్లు పంపిణీ చేశారు. దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ చేసి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా పుట్టిన రోజు సందర్భంగా పలు సేవ కార్యక్రమాలు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. అనంతరం తన ఇంటి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మిత్ర బృందం జిమ్మిడి కుమార్, సయ్యద్ అన్వర్ హుస్సేన్, పవన్, వంశీ పాల్గొన్నారు.



రాజుగూడ సమీపంలో శిథిలమైన డీ-24 కాల్వ

సాగునీరు పారేదెలా?

దండేపల్లి: మండలంలో కడెం డిస్ట్రిబ్యూటరీ కాల్వలు పలు చోట్ల శిథిలావస్థకు చేరాయి. సాగునీటి విడుదల సమయంలో కాల్వలు శిథిలమైన చోట, నీళ్లు వృధాగా పోవడంతో పాటు పైగా నీరు ముందుకు వెళ్లని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని తాళ్లపేట సమీపంలో డీ–23కాల్వ సిమెంట్ లైనింగ్ దెబ్బతినడంతో కాల్వ ఆనవాళ్లు కనిపించడం లేదు. ఇదే కాల్వలో తాళ్లపేట గ్రామ సమీపంలో ఇళ్లలోంచి మురుగు నీరు వచ్చి చేరడంతో, సాగునీటి కాల్వ మురుగు కాల్వను తలపిస్తుంది. డీ–24కాల్వ రాజుగూడ సమీపంలో లైనింగ్ పూర్తిగా పాడైపోయింది. ఇదే కాల్వకు మరో చోట సైడ్‌వాల్స్ కూలిపోయాయి. డీ–26 కాల్వ కూడా పలు చోట్ల లైనింగ్ పాడయ్యింది. డీ–30, కూడా అక్కడక్కడ దెబ్బతినడంతో పాటు షెటర్స్ పాడయ్యాయి. దాని పరిధిలోని సబ్‌డిస్ట్రిబ్యూటరీ4 కాల్వలో పిచ్చిమొక్కలు మొలిచాయి. అధికారులు స్పందించి ఖరీఫ్‌సాగుకు నీటిని విడుదల చేసే లోపు, సాగునీటి కాల్వలకు మరమ్మతు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈఈ సంజీవను సంప్రదించగా, డిస్ట్రిబ్యూటరీ కాల్వల మరమ్మతుకు సంబంధించి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.



పిచ్చిమొక్కలతో డీ-30, ఎస్‌డీ-4 కాల్వ



ఆనవాళ్లు కోల్పోయిన డీ-23 కాల్వ

గోదారున్నా.. గొంతెండుతోంది..!

- మంచిర్యాల మున్సిపాలిటీలో తాగునీటి తిప్పలు
- శివారు ప్రాంతాలకు నీళ్ల ట్యాంకులతోనే సరఫరా
- పట్టణంలోనూ రోజు విడిచి రోజు నీటి సరఫరా



ఏసీసీ అంబేద్కర్‌కాలనీలో నీటిని ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న మున్సిపల్ అధికారులు

మంచిర్యాలటౌన్: తలాపునే గోదావరి నది ఉన్నా, మంచిర్యాల మున్సిపాలిటీకి మాత్రం తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. గోదావరి నదిపై ఏర్పాటు చేసిన ముల్కల్ల పంప్‌హౌస్ నుంచి, ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా మంచిర్యాల మున్సిపాలిటీకి తాగునీటిని అందిస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా కేవలం కొన్ని వాటర్‌ట్యాంకుల వరకు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ముల్కల్ల పంప్‌హౌస్ నుంచి నీటి సరఫరా మాత్రం సక్రమంగా ఉండడం లేదు. గోదావరిలో ఏర్పాటు చేసిన మోటార్లు మొరాయించడం, తరుచూ మరమ్మతుకు గురికావడం, పైప్‌లైన్లు పగిలిపోవడం, రోడ్డు వెడల్పు పనులతో పైపులు పగిలి రోజుల తరబడి తాగునీరు పట్టణ ప్రజలకు అందడం లేదు. దీంతో గోదావరి నది పక్కనే ఉన్నా మంచిర్యాల మున్సిపాలిటీకి తాగునీటికి మాత్రం గోస తప్పడం లేదు. ప్రతిరోజు తాగునీటిని అందించాలని ప్రయత్నాలు చేస్తున్నా, పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ప్రాంతాలకు సైతం తాగునీరు సక్రమంగా అందడం లేదు. ఏదో ఒక మరమ్మతు పేరిట రెండు రోజులకు ఒకసారి తాగునీటిని అందిస్తున్నారు. రోజువిడిచి రోజు తాగునీటి సరఫరా చేసినా, ప్రజలకు అవసరమైన తాగునీరు సరిపోతుంది. వేసవికాలం కావడం, తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పాటుతో పట్టణ ప్రజలు మినరల్ వాటర్‌పైన ఆధారపడాల్సి వస్తోంది.

ట్యాంకర్ల నీటితోనే....

మంచిర్యాల మున్సిపాలిటీలో 25వేల వరకు ఇళ్లు ఉండగా, 14,742నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇందుకుగాను ప్రతిరోజు 14.85మిలియన్ లీటర్ పర్ డే చొప్పున తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో మంచిర్యాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకొకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇక మంచిర్యాల శివారు ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటిని సరఫరా చేయలేక, మున్సిపల్ వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. తాగునీటి ఎద్దడిని అరికట్టేందుకు ఏప్రిల్ నెలలో రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో కొంతమేర సమస్య తీరినా, నీటి కొరత రోజురోజుకు పెరుగుతుండడంతో తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, గోపాల్‌వాడ, మజీద్‌వాడ, రంగంపేట్, ఆండాళమ్మకాలనీ, ఏసిసి, ఒడ్డెర కాలనీ, ఎన్టీఆర్‌నగర్, శ్రీశ్రీనగర్ వంటి ప్రాంతాలకు తాగునీటిని మున్సిపల్‌ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం ఏప్రిల్ 2వ తేదీన మున్సిపాలిటీకి 4ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని మొత్తం 9ట్రాక్టర్ల ద్వారా తాగునీరు సరఫరా కానీ కాలనీలకు తాగునీటిని అందిస్తున్నా, అవి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రాష్ట్ర అవతరణ వేడుకలు వైభవంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య, పక్కన ఆర్డీవో శ్యామలదేవి

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలను వైభవంగా జరపాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. స్థానిక తిరుమలహిల్స్‌లోని ఫంక్షన్ హాల్లో గురువారం అసెంబ్లీ నియోజకవర్గస్థాయి దశాబ్ది వేడుకల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర అవరతణ వేడుకలు జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 21రోజుల పాటు నిర్వహించనున్నట్లు, ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం రోజువారీగా జరిగే కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఖచ్చితంగా ఉండేటట్లు చూడాలని ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కార్యాలయంలో పతాకావిష్కరణ

వేడుకల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పతాకావిష్కరణ చేయనున్నారు. ఉదయం 8–15 గంటలకు జెండావిష్కరణ చేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రారంభిస్తారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ శాఖ గ్రంథాలయం వద్ద ఉదయం 7–30గంటలకు జాతీయ పతాకం ఎగురవేస్తారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సన్నాహక సమావేశంలో ఆర్డీవో కె.శ్యామల దేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, బెల్లంపల్లి ఎంపీపీ శ్రీనివాస్, తాండూర్ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు

నెన్నెల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో మండల ప్రత్యేకాధికారి, డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్–2 నుంచి 21రోజుల పాటు విస్తృతంగా వేడుకలు నిర్వహించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలను భాగస్వాములను చేస్తూ ఉత్సవాలు విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీఓ శ్రీనివాస్, డీటీ ప్రకాష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

భీమిని: దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సన్నద్ధం కావాలని ఎంపీడీఓ రాధాకిషన్ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీఓ సతీష్, ఏపీఓ శ్రీనివాస్, ఏఓ శ్రీకాంత్, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం: ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం తెలంగాణా రాష్ట్ర సాధనపై మాట్లాడాలని సర్పంచులను కోరారు.

దండేపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3న అన్ని రైతువేదికల వద్ద రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ప్రకాశ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్లేశం, ఏవో అంజిత్‌కుమార్‌తో పాటు, ఏఈవోలతో గురువారం సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగంలో జరిగిన అభివృద్ధిని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులకు వివరించాలన్నారు.

పని ప్రదేశానికి వెళ్లి.. కూలీలతో ముచ్చటించి



దండేపల్లి: గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దండేపల్లి మండలం పెద్దపేట గ్రామాన్ని గురువారం సందర్శించారు. కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లడంతో, ఆమె కూడా పనిప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని, సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. అనంతరం ఇంటింటా తిరిగారు. ఆమె వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వానికి కార్మికవర్గం మద్దతు తెలపాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్: నస్పూర్‌లో ఈ నెల 9న జరిగే కేసీఆర్ బహిరంగసభకు అధిక సంఖ్యలో కార్మికులు తరలి రావాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. ఆర్కే 5 గనిపై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి కార్మికులు ఏది కోరినా కాదనకుండా కేసీఆర్ ఇచ్చారని, నాడు జాతీయ సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య ఉద్యోగాలుగా ఇప్పించారని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని హక్కులు, సదుపాయాలు రావాలన్నా కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి కార్మికవర్గం మద్దతుగా నిలవాలని సూచించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే కార్మికులతో కలిసి క్యాంటిన్‌లో అల్పాహారం చేశారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మల్లారెడ్డి బ్రాంచ్ నాయకులు సత్తయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు సంతోష్ చారి, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్, టింబర్‌యార్డులో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిట్ కమిటీని గురువారం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నెలబోయిన కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఫిట్ కార్యదర్శిగా ఏ.అశోక్, అసిస్టెంట్ సెక్రటరీగా సుద్దమల్ల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కొమురయ్య, కోశాధికారిగా పల్లె క్రాంతికుమార్, మహిళా కన్వీనర్‌గా డేగల వసంత ఎన్నికయ్యా రు. కార్యక్రమంలో నాయకులు కాసిపేట శంకర్, నారాయణ, శివ జ్యోతి, స్పందన పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకల్లో కార్మికులందరూ పాల్గొనాలి

- జీఎం సంజీవరెడ్డి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో గురువారం ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. నస్పూర్‌కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి ర్యాలీగా జీఎం కార్యాలయానికి చేరుకొని తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తరువాత జీఎం కార్యాలయ వద్ద జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తంరెడ్డి, మేనేజర్ సుధీర్, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, నాయకులు మంద మల్లారెడ్డి, మైపాల్ రెడ్డి, కందుల శంకర్, గని సంక్షేమ అధికారి బొంగుని శంకర్ పాల్గొన్నారు.

జైపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 5వ తేదీన సింగరేణి సంబురాలు నిర్వహించుకుంటున్నట్లు, కార్యక్రమాన్ని ఉద్యోగులందరూ విజయవంతం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ, ఐకే–ఓసీపీ గనిపై గురువారం అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి సంబురాలకు కుటుంబసమేతంగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఐకే1–ఏ, ఐకే–ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, మేనేజర్ రవికుమార్, ఆపరేషన్స్ మేనేజర్ బ్రహ్మాజీరావు, ఐకే–1ఏ మేనేజర్ నాగన్న, ఫిట్ కార్యదర్శులు గడ్డం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా సభ్యులతో సమావేశం

శ్రీరాంపూర్: సింగరేణి సంబురాలపై జీఎం సంజీవరెడ్డి గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్లో శ్రీరాంపూర్ ఏరియా కమ్యూనికేషన్ సెల్ కళాకారులు, సేవా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఈ నెల 5న సింగరేణి సంబురాలను సేవాసభ్యులు, కళాకారులు తమతమ ప్రదర్శనలిచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. సింగరేణి ఖ్యాతిని ప్రదర్శనల ద్వారా చాటాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, కళాకారులు గజెల్లి రాయలింగు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బియ్యం సరఫరాపై విచారణ జరిపించాలి



తాండూర్: మండలంలోని ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో లబ్ధిదారులకు ప్లాస్టిక్ బియ్యం సరఫరా అయ్యాయని, వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ బోర్డు కమిటీ సభ్యుడు పుల్గం తిరుపతి డిమాండ్ చేశారు. డెప్యూటీ తహసీల్దార్ రజినీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొత్తపల్లి గ్రామ రేషన్‌షాపులో లబ్ధిదారులకు ప్లాస్టిక్ బియ్యం సరఫరా అయ్యాయని తెలిపారు. రేపల్లె గ్రామానికి చెందిన 10కుటుంబాలు బియ్యాన్ని వంటచేయగా ఉబ్బాయని, ఆ ఆహారం తిన్న పలువురు కడుపునొప్పికి గురయ్యారని తెలిపారు. ప్రజల్లో ప్లాస్టిక్ బియ్యం సరఫరా అయినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఏ మాత్రం జాప్యం చేయకుండా మండలంలోని మిగితా రేషన్‌షాపులను తనిఖీ చేసి, ప్లాస్టిక్ బియ్యాన్ని గుర్తించి పంపిణీ కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేయాలని సూచించారు. లోపం ఎక్కడ జరిగిందో గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అన్ని యూనియన్లను ఆహ్వానించాలి

మందమర్రిరూరల్: మందమర్రి డివిజన్‌లో సింగరేణి యాజమాన్యం నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు అన్ని యూనియన్లను ఆహ్వానించి, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గురువారం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో కాల పరిమితి ఐపోయినప్పటికీ యాజమాన్యం ఏకపక్షంగా టీబీజీకేఎస్ సంఘాన్ని మాత్రమే ఉత్సవాలకు ఆహ్వానించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గురువారం శ్రమశక్తి అవార్డు గ్రహీతలు ఒడ్నాల రాజన్న, సీ.వి.రమణ, పెండ్రి రాజిరెడ్డి, శంకర్‌రావును శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

పాస్టర్ల నిరసన

జన్నారం: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఓ సభలో యేసు క్రీస్తు బోధనలు చేసే పాస్టర్స్‌పై చేసిన అనుచిత వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని జన్నారం మండల పాస్టర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవన్ ప్రకాశ్, షాలేము రాజు డిమాండ్ చేశారు. ఎంపీ వాఖ్యలపై గురువారం నిరసన వ్యక్తం చేశారు. వెంటనే పాస్టర్స్‌కు క్షమాపణ చెప్పకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

నర్సరీ పరిశీలన

చెన్నూర్‌రూరల్: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు రెండు పూటలా నీరందించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని అంగ్రాజ్‌పల్లి, చెల్లాయిపేట, దుగ్నెపల్లి గ్రామాల్లో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. హరితహారానికల్లా మొక్కలను సిద్ధం చేసి ఉంచాలని, సంబంధిత ఎఫ్ఏలకు తెలియజేశారు.

'స్ట్రీట్‌లైట్లు ఇంట్లో వాడుకుంటున్నారు'

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామ పంచాయతీలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలకు ఉండాల్సిన స్ట్రీట్ లైట్లు, ఇళ్లలో వాడుకుంటున్నారని మూడో వార్డు సభ్యుడు, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొటారి వెంకటేశ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

రోడ్డు సమస్యపై స్పందించాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లిచౌరస్తా నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే దారి భూ వివాదం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్ గురువారం ఆరోపించారు. కొంత కాలంగా ఈ దారిపై భూ వివాదం కోర్టులో కేసులు నడిచాయని, ఆ స్థలానికి చెందిన యజమాని ఆ భూమిలో ఫెన్సింగ్ వేయడంతో ఆ మార్గంలో వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దారి సమస్యపై మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చాడ మహేందర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు బియ్యాల రాజేశం, నర్సయ్య పాల్గొన్నారు.

బైక్ సైలెన్సర్లు తొలగింపు

భీమారం: మండల కేంద్రంలో చెన్నూరు-మంచిర్యాల జాతీయరహదారిపై భారీ శబ్దాలతో వెళ్తున్న పలు ద్విచక్రవాహనాలను గురువారం ఎస్సై రాజవర్ధన్ తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలకు అదనంగా అమర్చిన సైలెన్సర్లను తొలగింపజేశారు. బైక్‌లతో జులాయిగా తిరిగితే పట్టుకొని, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.